క్లుప్తంగా

భాషా పరిజ్ఞానం అవసరం



గ్రంథాలయంలో నీతి కథలు చెప్తున్న వెంకటేశ్వరరావు

పెద్దాపురం: పిన్న వయసు నుంచే విద్యార్థులకు మంచి భాషా పరిజ్ఞానం అవసరమని ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం నీతి కథలు, పుస్తక సమీక్షపై సుమారు 20 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో పొందుపరచిన పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీసీసీ కన్వీనర్ కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన ఓ ట్యూషన్ సెంటర్ నిర్వాహకుడు రఫీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ పోటీ తత్వాన్ని అలవరచుకుని ప్రతిభ కనపరచాలన్నారు.

మాజీ ఉప సర్పంచ్ గోలి మృతి



గోలి వెంకట్రావు (ఫైల్)

సామర్లకోట: వేట్లపాలెం సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ గోలి వెంకట్రావు (65) ఆదివారం మృతి చెందారు. వేట్లపాలెం గ్రామంలో తన స్వగృహంలో ఉదయం గుండెపోటుకు గురికావడంతో హుటాహుటిన అచ్చంపేట రోడ్డులో మెడికవర్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి వివిధ పార్టీల నాయకులు, రైతు సంఘ నాయకులు సంతాపం ప్రకటించారు.

ఏఎస్‌డీ కళాశాలలో ఉచిత శిక్షణ

బాలాజీచెరువు: అన్నవరం సత్యవతీ దేవి మహిళా డిగ్రీ కళాశాలలో డేటాఎంట్రీ, టైలరింగ్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి ఆదివారం తెలిపారు. డేటా ఎంట్రీ కోర్సుకు ఇంటర్మీడియట్, టైలరింగ్ కోర్సుకు 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 63047 31843 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

వచ్చే నెల ఐదున దేవస్థానం భూముల కౌలు వేలం

కరప: స్థానిక శివాలయంలో దేవదాయశాఖకు చెందిన భూములు కౌలుకు సాగు చేసుకునేందుకు వచ్చేనెల ఐదో తేదీన ఉదయం 9 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ కె.తిరుమల రవితేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామలింగేశ్వరస్వామివారి దేవస్థానానికి సంబంధించి 7 ప్రతులుగా ఉన్న 19.67 ఎకరాలకు, విష్ణాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వేణుగోపాలస్వామివారి దేవస్థానానికి సంబంధించి ఏడు ప్రతులుగా ఉన్న 18.74 ఎకరాలకు విడివిడిగా (ఒక్కొక్క ప్రతికి) మూడేళ్ల కాలపరిమితికి కౌలుకు సాగుచేసుకునే నిమిత్తం వేలంపాట నిర్వహించనున్నారు. పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు ప్రథమ ధరావతుగా చెల్లించాలన్నారు. హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరం శిస్తులో సగం సొమ్మును పాట కొట్టివేసిన వెంటనే చెల్లించాలన్నారు. పాట నిలిపివేతకు, వాయిదా వేయడానికి ఈఓకు పూర్తి అధికారం ఉందన్నారు. మిగిలిన వివరాలకు దేవస్థానం సిబ్బందిని సంప్రదించాలని ఈఓ తిరుమల రవితేజ సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంఖవరం: మన చుట్టూ ఉంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీయించి, దోమల మందు పిచికారీ చేయించారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సాంకేతిక విద్యపై అవగాహన

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు అప్పన్నబాబు విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు వివిధ అంశాలపై మెళకువలు నేర్పారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఎన్నాళ్లకు సాగుతారో..

- ఆలస్యంగా పూడికతీత ప్రారంభం
- నెల్లాళ్ల క్రితమే ప్రభుత్వం ఆదేశించినా స్థానిక అధికారుల్లో నిర్లక్ష్యం
- వచ్చేనెల మొదటి వారంలోనే గోదావరి జలాల విడుదల
- ఎప్పటికి పూర్తవుతాయోనని అన్నదాతల్లో ఆందోళన



సామర్లకోట ఐదు తూముల సమీపంలో వ్యవసాయ పరిశోధనా క్షేత్రం వద్ద పూడిక తీస్తున్న జేసీబీలు



వీకే రాయపురంలో గుర్రపుడెక్కతో పేరుకుపోయిన తూటేరు డ్రైన్

సామర్లకోట: సరైన ప్రణాళిక లేకపోతే ఏ యంత్రాంగమైనా దానిపై ఆధారపడిన వారికి న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంటుంది. అందులోనూ కార్యనిర్వాహక యంత్రాంగంలో ఆ ప్రణాళిక లేకుంటే సంబంధిత శాఖల వ్యవస్థలు చాలా సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. పాలనా పరంగా ప్రభుత్వాలు ఎంత ముందు చూపుతో వ్యవహరించినా, ఎన్ని ఆదేశాలు ఇచ్చినా వాటిని అమలు చేయాల్సిన అధికారగణం సకాలంలో స్పందించకపోతే ప్రభుత్వ నిర్ణయాలు నిరుపయోగమై కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. నీటిపారుదల శాఖకు సంబంధించి తాజాగా అదే పరిస్థితి నెలకొంది. పంటకాలాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, గోదావరి జలాలను వదిలే సమయానికి పంటకాలువలు జలకళతో ఉండాలని, నీరు జోరుగా సాగేలా పూడిక తీతలు ప్రారంభించాలని, తద్వారా గోదావరి జలాల విడుదల, నిలిపివేతల మధ్య కాలంలో అన్నదాత తన పంట పనులు చేసుకుంటాడని నెల రోజుల క్రితమే తగిన ఆదేశాలు జారీ చేసింది. కానీ స్థానిక యంత్రాంగం మాత్రం తీరిగ్గా నాలుగు రోజుల నుంచి మాత్రమే పూడిక తీత పనులు ప్రారంభించింది. గోదావరి కాలువ నుంచి ఆయా గ్రామాల్లోని పంట కాలువకు జోరుగా, అడ్డంకులు లేకుండా, గోదావరి జలాలు చురుగ్గా నిండుగా ప్రవహించేలా ఎటువంటి పూడికలు లేకుండా ఏటా లేదా రెండేళ్లకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ పనులను ఇరిగేషన్ అధికారులు జేసీబీలతో తాజాగా ప్రారంభించారు. మండల పరిధిలో సామర్లకోట నుంచి పీబీ దేవం వరకు ఉన్న పంట కాలువలకు నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ఈ చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ పనులు మొదలుపెట్టిన దగ్గర నుంచీ సామర్లకోట ప్రాంతానికే ఆ కార్మికులు పరిమితమైతే మిగిలిన గ్రామాల్లోని పంట కాలువలకు నీరు వెళ్లే కాలువల పూడిక తీత ఎప్పుడు పూర్తి చేస్తారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనంతో వర్షాలు పడుతున్నాయి. దీనికి తోడు జూన్ మొదటి వారంలో గోదావరి కాలువకు నీరు విడుదల చేసే అవకాశం ఉందని ఇటువంటి పరిస్థితిలో పూడికతీత పనుల ఆలస్యంగా ప్రారంభించడం సరికాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువలో తీసిన పూడిక గట్టుపై వేయడం వల్ల వర్షాలకు తిరిగి గోదావరి కాలువలోకే ఆ మట్టి చేరుతుందనే విమర్శలు ఉన్నాయి. తీసిన పూడికను వాహనాలలో తరలించేలా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గోదావరి కాలువ మూసి వేసిన వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తే రైతులకు మేలు జరుగుతుందని రైతులు భావించారు. అలాగే గోదావరి కాలువ మూసి వేసిన వెంటనే కాలువ వెంబడి ఉన్న గుర్రపు డెక్క దుంపను తొలగిస్తే తరుచూ గోదావరి కాలువలో గుర్రపు డెక్క పెరిగే అవకాశం ఉండదని రైతులు సూచిస్తున్నారు.

సారా తయారీ, విక్రయం చేస్తే కటిన చర్యలు

కొత్తపల్లి: సారాను తయారు చేసినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్వామినాయుడు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సారాను తయారు చేయడం, విక్రయించినా ప్రజలు సహకరించి తమకు సమాచారాన్ని అందించాలన్నారు. యువత పెడతోవ పట్టి జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల సూచనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. సారా విక్రయిస్తే సంబంధిత గ్రామాల్లోని ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సాయం చేయబోతే సెల్‌ఫోన్ చోరీ

సామర్లకోట: రోడ్డుపై పడిపోయి ఉన్న వ్యక్తికి చెయ్యి ఇచ్చి లేపడానికి ప్రయత్నం చేసే సమయంలో వెనుక నుంచి మరో వ్యక్తి చొక్కా జేబులోని సెల్‌ఫోన్‌ను చోరీ చేసి ఉడాయించాడు. స్థానిక సత్యనారాయణపురంలో నివసిస్తున్న ఆర్ఎంపీ డాక్టరు ఇనకోట సురేష్ తన ఇంటి సమీపంలో అనారోగ్యానికి గురైన వ్యక్తికి వైద్య పరీక్షలు చేసి మోటారు సైకిలుపై శనివారం రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై పడిపోయి ఉన్న ఒక గుర్తు తెలియని వ్యక్తి చెయ్యివ్వమని సైగ చేయడంతో మోటారు సైకిలు నుంచి సురేష్ చెయ్యి అందించి లేపే ప్రయత్నంలో ఉండగా వెనుక మోటారు సైకిలుపై ఉన్న మరో వ్యక్తి డాక్టర్ జేబులోని సెల్‌ఫోన్‌ను లాఘవంగా చేజిక్కించుకోవడం, పడిపోయిన వ్యక్తి శైతం మోటారు సైకిల్ ఎక్కి పరారవడం క్షణాల్లో జరిగిపోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు సిద్ధం



సబ్జెక్టుల వారీగా పాఠ్య పుస్తకాలు సిద్ధం చేస్తున్న సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది

గొల్లప్రోలు: పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే విద్యార్థులకు కావలిసిన పాఠ్య పుస్తకాలు సిద్ధం చేస్తున్నామని ఎంఈఓ-2 వీవీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ నుంచి మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు చేబ్రోలు హైస్కూల్‌లో సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి పదో తరగతి వరకూ వివిధ సబ్జెక్టులకు సంబంధించి 24,430 పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు విడతల వారీగా వస్తున్నాయన్నారు. మండల వ్యాప్తంగా 41 ప్రభుత్వ పాఠశాలల్లో 5,800 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా నాడు-నేడు పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా దృష్టి సారించామన్నారు. సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

గొల్లప్రోలు: గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని తాటిపర్తి, కొడవలి, వన్నెపూడి గ్రామాల్లో ఆదివారం గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి గొడవలు జరగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలని అనంతరం అందరూ అన్నదమ్ముల్లా మెలగాలన్నారు. ఎన్నికల ఫలితాల కోసం ఫలితాలు వచ్చిన తర్వాత ఎవరైనా గ్రామాల్లో తగదాలు సృష్టిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వేంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలాజీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా సీతారామాలయ నిర్మాణం



గొంచాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న భద్రాద్రి సీతారామాలయం

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామంలో భద్రాద్రి సీతారామాలయ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఆలయ నిర్మాణానికి పంచాయతీ తీర్మానంతో స్థలం కేటాయించారు. గొంచాల గ్రామం నుంచి ఏటా కాలినడకన సుమారు 200 మంది భక్తులు భద్రాచలం సీతారాముల విగ్రహాలు ఉంచి రథంతో వెళ్తుంటారు. దాతల సహకారంతో టేకు కర్రతో రథాన్ని నిర్మించగా దానిని పార్క్ చేయడానికి పంచాయతీ స్థలం ఇవ్వగా ఆస్థలంలో షేడ్ నిర్మించారు. అదే విధంగా ఆలయ నిర్మాణానికి అనేక మంది భక్తులు ముందుకు రావడంతో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆలయం గర్భాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించే ప్రదేశంలో ఇసుకతో పాటు ఆలయ ప్రాంగణాన్ని ఎత్తు చేయడంతో పాటు మండపానికి శ్లాబ్ పనులు చేయాల్సి ఉన్నదని వాసుదేవ సుబ్బారావు తెలిపారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక..



2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పిఠాపురం: స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాయంలో ఆదివారం విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2007-2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులంతా గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని రోజంతా సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

నూకాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



పూజలందుకుంటున్న నూకాలమ్మ తల్లి



అమ్మవారి దర్శనానికి నాలుగు క్యూలలో వెళ్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చు ఇలవేల్పు మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. జాతర ముగిసినా వేసవి సెలవులు కావడంతో ఈ వారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొత్త అమవాస్యను పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు కల్పించారు. సుమారు వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ నిరంతర పరిశీలన

జేసీ, పిఠాపురం ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ, పిఠాపురం ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదివారం కాకినాడ జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి స్ట్రాంగ్ రూమును సందర్శించి పరిశీలించారు. అక్కడ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూముకు పటిష్ట భద్రత కల్పించామన్నారు. అదే విధంగా స్ట్రాంగ్ రూము వద్ద అన్ని వైపులా కనిపించేలా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘాను పరిశీలించడం జరుగుతుందని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

పామాయిల్ తోటలకు పంపింగ్ స్కీమ్ నీరు



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నేత వీరాంజనేయులు

జగ్గంపేట: భావవరం గ్రామంలో మంచినీటి పథకం (ఫిల్టర్ బెడ్స్) నుంచి తాగునీటిని పక్కనే ఉన్న పామాయిల్ తోటలకు సరఫరా చేస్తున్నారని, ప్రజలకు తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం నేతలు ఆరోపించారు. జగ్గంపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ భావవరం పంపింగ్ స్కీమ్ ద్వారా జగ్గంపేట, గండేపల్లి మండలాలకు చెందిన 41 గ్రామాలకు తాగునీరు అందుతుందని, అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు సక్రమంగా తాగునీరు అందడంలేదన్నారు. తరచూ కరెంట్ పోతున్నా పట్టించుకునే నాథుడు లేడని, అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కై ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులు, క్లోరినేషన్ చేయకుండా కలుషిత నీరు ప్రజలకు సరఫరా చేస్తున్నారని, నిధులు మత్రం యథావిధిగా తీసుకుంటున్నారని విమర్శించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో రైతు కూలీ సంఘం నేతలు పాల్గొన్నారు.

పామాయిల్ తోటలకు వెళ్లేది పనికిరాని నీరు : ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంజీ

రైతు కూలీ సంఘం నేతలు భావవరం ఫిల్టర్ బెడ్స్ నిర్వహణపై చేసిన ఆరోపణలలో ఎలాంటి వాస్తవాలు లేవని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంజీ వివరణ ఇచ్చారు. ఫిల్టర్ బెడ్స్ ద్వారా ఏలేరు జలాలు శుద్ధి చేయగా రోజు వేలాది లీటర్ల వేస్టు వాటర్ వస్తుందని, వాటిని మాత్రమే పామాయిల్ తోటలకు రైతులు పెట్టుకుంటున్నారని అన్నారు. కరెంట్ పోవడం సమస్య ఉందని తెలిపారు. అయితే స్వచ్ఛమైన తాగునీరు అన్ని గ్రామాలకు అందుతోందని తెలిపారు.

కాత్రావులపల్లిలో రాజు యాదవ్ చిత్రం యూనిట్ సందడి

జగ్గంపేట: కాత్రావులపల్లిలో రాజు యాదవ్ చిత్రం యూనిట్ సభ్యులు ఆదివారం సందడి చేశారు. చిత్ర నిర్మాత కల్లేపల్లి రాజేష్(ఎన్ఆర్ఐ) స్వగ్రామం కాత్రావులపల్లి కావడంతో గ్రామంలో ఆయన మిత్రుల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామివారికి పూజలు చేశారు. చిత్ర హీరో గెటప్ శ్రీను, హీరోయిన్ అంకిత ఖాతర్, దర్శకుడు కృష్ణమాచారి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శకుడు కృష్ణమాచారి విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విడుదల అయిన రాజు యాదవ్ చిత్రాన్ని అభిమానులు ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్రంలో మొదటిసారి అవకాశం కల్పించిన నిర్మాత కల్లేపల్లి రాజేష్‌కు యూనిట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ చిత్రాన్ని జగ్గంపేట కృష్ణవేణి థియేటర్‌లో యూనిట్ సభ్యులు ప్రేక్షకులతో పాటు వీక్షించారు. జనసేన ఇన్‌చార్జీ తుమ్మలపల్లి రమేష్, థియేటర్ యజమాని టి.శ్రీను, కాత్రావులపల్లికి చెందిన రాజేష్ మిత్రులు, అభిమానులు పాల్గొన్నారు.

రఘుపతి వెంకటరత్నం చిరస్మరణీయుడు



రఘుపతి వెంకటరత్నానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: విద్యారంగాన్ని దేదీప్యమానం చేసిన నవయుగ వైతాళికుడు రఘుపతి వెంకటరత్నంనాయుడు అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాల లోని బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి సందర్భంగా ఐడీఏ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆధ్యాత్మిక నవజీవనానికి వసుధైక కుటుంబ భావనకు పునాదులు వేసి జీవితాంతం కృషి చేసింది రఘుపతి వెంకటరత్నం నాయుడు అన్నారు. విద్యాలయాలే తపో నిలయాలుగా చేసిన కర్మయోగి అన్నారు. అసోసియేషన్ సభ్యులు చిట్ల కిరణ్ మాట్లాడుతూ రఘుపతి వెంకటరత్నం నాయుడు విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా, పవిత్రతకు సంకేతంగా, బ్రహ్మర్షిగా దేశంలోని తెలుగు ప్రాంతాల్లో పేరుపొందిన వ్యక్తి అన్నారు. సంఘ సంస్కరణోద్యమమన్నా, బ్రహ్మ సమాజమన్నా గుర్తుకు వచ్చే పేరు కందుకూరి వీరేశలింగం పంతులుతో పాటు రఘుపతి వెంకటరత్నం నాయుడుదే అన్నారు.

రఘుపతి వెంకటరత్నానికి ఘనంగా నివాళి

కాకినాడ రూరల్: రమణయ్యపేట సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద ఉన్న వెంకటరత్నం నాయుడు విగ్రహానికి విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, డాక్టరు అడ్డాల సత్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, ఎం.సుబ్బారావు, రెడ్డం రాజా, చంటిబాబు తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రఘుపతి వెంకటరత్నం నాయుడు గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన ఆయన బాలికల చదువులను ప్రోత్సహించారన్నారు.

సంఘటితమైతే సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కాకినాడ సిటీ: జిల్లా సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం కాకినాడలో అసోసియేషన్ అధ్యక్షుడు బళ్లమూడి సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సీనియర్ సిటిజెన్ల సమస్యలను చర్చించారు. ప్రతి మండలంలో సీనియర్ సిటిజన్ల సంఘాన్ని ఏర్పాటు చేయడం ద్వారా వారు ఎదుర్కొనే పలు సమస్యలను పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. సంఘాలు ఏర్పాటుకు ప్రతి సభ్యుడు ప్రయత్నించాలన్నారు. జూన్ 15వ తేదీన సీనియర్ సిటిజన్ల వేధింపుల నివారణ దినోత్సవం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జిల్లాలో శాశ్వత కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. సంఘ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు అధ్యక్షుడు సూర్యనారాయణ వారి సమస్యలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్ల సంఘ నాయకులు ఆర్ఎస్ సుధాకర్, వి.శివాజీ, విశ్వేశ్వరరావు, ఎంజీఎం నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, వి.రామసుబ్బారావు, జీఎస్‌పీ ప్రసాద్, ఎం.గోపాలరావు, బొంతు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏకదంత సంకష్టహర చతుర్థి

బోట్‌క్లబ్: సంకష్టహర చతుర్థి సృష్టి ఆరంభం నుంచి త్రిమూర్త్యాత్మకంగా కొలిచే ఉపవాస ఉత్సవమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఏకదంత సంకష్ట హర చతుర్థి సందర్భంగా ఆదివారం సన్నాయి మంగళ వాయిద్యాలతో నగర సంకీర్తన పాలవెల్లి పండ్ల తోరణాలతో సిద్ధి, బుద్ధి గణేశ కలశప్రతిష్ఠ నిర్వహించారు. సాయంత్రం వేళలో సహస్ర నామార్చన చంద్రహారతి ఏర్పాటు చేశారు.